# హంసలను వేటాడొద్దు [7]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [7]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: మే 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2519

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [7]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** యెగార్ తోడల్లుడు ఫ్యొడార్ ఇపటొవిచ్ కు కొత్త అటవీగార్డెను వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. ఇన్నాళ్లూ ఫ్యొడార్ అన్యాయంగా చేసిన కలప వ్యాపారానికి లెక్కలూ పత్రాలూ చూపించమంటాడు అటవీగార్డెను. మరోపక్క పర్యాటకులు తాగించిన మందు మత్తులోంచి బయటపడతాడు యెగార్. లేచేసరికి పడవ తాలూకు మోటారు చెరువులో మునిగిపోయి ఉంటుంది. యెగార్ చేత చెంపదెబ్బ తిన్న అతని కొడుకు కోల్కా కూడా కనపడడు. యెగార్ భార్య హారిటీనా కోల్కా కోసం ఊరంతా వెతుకుతుంది. చివరకు కోల్కా తండ్రి కొట్టాడన్న కోపంతో తన టీచరు ఇంట్లోకి వెళ్లి పడుకున్నాడని తెలుస్తుంది. రేవు అధికారి యకోవ్ ప్రొకోవిచ్ తన బోటు మోటారు పోగొట్టిన యెగార్ ని నష్టపరిహారంగా మూడువందల రూబుళ్లు చెల్లించమనీ, లేదంటే పోలీసుల దగ్గరికి వెళ్తాననీ అంటాడు. ఈ డబ్బు సంపాదించటం కోసం యెగార్ తన పెంపుడు పందిని చంపి దాని మాంసాన్ని అమ్మటానికి పట్టణం బజారుకు బయల్దేరతాడు. **ఇక చదవండి:——**

## 7

కోల్కా పొలుష్కిన్ జీవితంలో అప్పటివరకు ఎవ్వరితోనూ తీవ్రంగా గొడవపడలేదు. అటువంటి అవకాశమూ రాలేదు, అంతటి తంపులమారి మిత్రులూ లేరు. బాధ కలిగించే సంఘటనలకు కొదవ లేకపోయినప్పటికీ. అవన్నీ అతని శరీరాన్నే తాకాయి. అప్పటివరకు అతని ఆత్మను ఎవరూ తాకలేదు, దానిని బాధ పెట్టలేదు. అందువల్ల అప్పటివరకు అతడి ఆత్మకి నొప్పి అంటే ఏమిటో తెలియదు. అతడి హృదయం ఇంకా మొద్దుబారలేదు: అది జీవితంలో – ఆ జీవితాన్ని అతడి పెదనాన్న ఫ్యొడార్ ఇపటొవిచ్ బుర్యానోవ్ విలువలతో కొలిస్తే పెద్ద లోపమే.

కానీ కోల్కాకి అతడి సొంత విలువలు ఉన్నాయి, అందుకే నాన్న కొట్టిన దెబ్బ లోపల కొలిమిలాగా మండుతోంది. అది ఆరకుండా మండుతూ అతడిని దహించివేస్తోంది, బాధిస్తోంది. ఎవరికైనా అదంత పెద్ద విషయం కాదని అనిపిస్తుంది: ఆ దెబ్బ వేసింది ఎవరో కాదు అతడి నాన్నేగా. ఈ విషయం ఎవరికైనా చెపితే వాళ్లు నవ్వేస్తారు.

“ఇక ఆ అలక ఆపు, అబ్బాయి! నువ్వు అలుగుతోంది మీ నాన్న మీదే, ఆ విషయం ఆలోచించు.”

కానీ కోల్కా ఎంత ఆలోచించినా, ఆ ఆలోచన ఒక్కటే సరిపోలేదు. ఇక్కడ ఇంకేదో అవసరం ఉంది. అందుకే కళ్లనీళ్లతో ఏమీ కానరాకుండా ఉన్నప్పుడు ఎటువంటి ఆలోచనలు లేకుండా అంతా అర్థం చేసుకుని అతడికి సహాయపడతారన్న నమ్మకమున్న చోటుకి అతడు వెళ్లాడు. “వాళ్లు ‘అతడిని ఒక్కటెయ్యి!’ అనగానే నన్ను కొట్టాడు.” దయతోపాటు దృఢత్వమూ ఉండాలి! నోనా యురీవ్నా మంచి శ్రోత. పెద్దవాళ్లను చూసినట్టు ఆమె కోల్కాని చూసింది. ఆ చూపుకే ఉన్నట్టుండి కోల్కా వెక్కిళ్లు పెడుతూ పొగిలి పొగిలి ఏడ్వసాగాడు. నోనా ఒడిలో ముఖం పెట్టుకుని అతడు ఏడ్చాడు. కానీ అతడిని ఓదార్చటానికి ఆమె ప్రయత్నించలేదు. అదేమంత పెద్ద విషయం కాదని, కొట్టింది ఎవరో కాదు అతడి తండ్రేనని, అంతా త్వరలోనే మరిచిపోతాడని ఆమె నచ్చచెప్పలేదు. ఆ క్షణంలో కోల్కా ఎటువంటి మాటలూ కోరుకోలేదు. నోనా యురీవ్నా కూడా ఏమీ మాట్లాడకుండా చిక్కటి పాలు, ఒక మందు ఇచ్చి అతడిని పడుకోబెట్టింది. “మనం రేపు మాట్లాడుకుందాం, కోల్కా.” తెల్లవారేసరికి కోల్కా కొంత తేటపడ్డాడు, అయితే గాయం అలాగే ఉండిపోయింది. అది అతడి శరీరంలో లోతుగా దిగబడిపోయినట్టు ఉంది – ఎంత లోతుగా అంటే, ఆ గాయాన్ని అతడు బయటనుంచి చూడగలుగుతున్నాడు. అది బోనులో చిక్కిన జంతువులా ఉంది. లోపల ఇమడని ఆ జంతువు కోల్కాకి నిత్యం తెలుస్తూనే ఉంది; అతడు దానిని పరీక్షించాడు, కానీ అది నవ్వలేదు. ఇది ఆందోళన కలిగించే విషయం. “అతడికి కోపం వచ్చో, మరెందుకో తనంతటతానే నన్ను కొట్టి ఉంటే అది వేరే విషయం, నోనా యురీవ్నా. కానీ వాళ్లు అతన్ని రెచ్చగొట్టారు. వాళ్లకి ఆ అవకాశం ఎందుకు ఇచ్చాడు? ఎందుకు?” “కోల్కా, మీ నాన్న – మంచివాడు. చాలా మంచివాడు. ఒప్పుకుంటావా, లేదా?” “మంచివాడైతే ఏమిటి?” నోనా యురీవ్నా వాదించలేదు: కోల్కాకి ఆ విషయం క్షుణ్ణంగా తెలుసు కాబట్టి ఇక్కడ వాదించటం కష్టం. నాన్నతోనే మాట్లాడితేనో అని చిన్నగా సూచించింది. కానీ కోల్కాకి అది నచ్చలేదు: “తప్పు చేసినవాళ్లే ముందు మాట్లాడాలి.” “పెద్దవాళ్లను అలా అడగవచ్చా?” “నాకంటే పెద్దవాడు కాబట్టి అతడు నాకు ఆదర్శప్రాయంగా ఉండాలి: అదే కదా మీరు మాకు నేర్పిస్తోంది? మరి అతడు ఎటువంటి ఆదర్శం చూపిస్తున్నాడు? బానిసలాగా ప్రవర్తించటమా? నేను బానిసలాగా ప్రవర్తించను, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవర్తించను!”

నోనా యురీవ్నా నిట్టూర్చింది. జానపద కథల్లో మాదిరి ఎక్కడో దూరాన, ఎవరికీ అందని లెనిన్‌గ్రాడ్‌లో పంతులమ్మ అయిన ఆమె తల్లి ఒంటరి జీవితం గడుపుతోంది. ఇంటినిండా మనుషులతో ఎప్పుడూ కీసర బాసరగా ఉండే కుటుంబంలో, సైనిక ముట్టడి తరువాత బతికి బట్టకట్టిన ఏకైక సంతానం ఆమె. ఆ తరువాత శాంతి సమయంలో ఆమె భర్త చనిపోయాడు. నోనా మాదిరి ఆమె కూడా ఎంతో నిశ్శబ్దంగా, క్రమశిక్షణతో, అంతరాత్మ ప్రకారం నడుచుకునే మనిషి: ఆమె కూతురు చదువు పూర్తి చేసిన తరువాత ఈ మారుమూల ప్రాంతంలో ఉద్యోగం వస్తే ఆమె ఎంతో ఏడ్చింది. “జాగ్రత్త, బిడ్డా.” “జాగ్రత్త, అమ్మా.” ఈ కాలనీలో నోనా ఒక ఎలుక మాదిరి జీవించేది: ఇంటి నుంచి బడికి, బడి నుంచి ఇంటికి వెళ్లేది. ఆమెకు ఇరవైమూడు ఏళ్లు కాక అరవైఎనిమిది అన్నట్టు ఒక విందు లేదు, వినోదం లేదు; ఒక ఆట లేదు, పాట లేదు.

“స్టెంకా రాజిన్ గురించి ఒక పాట వింటావా?” నోనా యురీవ్నా దగ్గర రెండు పెట్టెల నిండా పాటల రికార్డులు ఉన్నాయి. అంతకంటే ఎక్కువ పుస్తకాలు ఉన్నాయి. వీటివల్ల ఆమె ఇంటి యజమానురాలు భయపడుతుండేది.

“నీకు ఎన్నటికీ పెళ్లికాదు, నోనా.” “అలాగెందుకంటారు?” “నువ్వు పుస్తకాలతో ఎక్కువ సమయం గడుపుతావు. వాటినుంచి కొంత విరామం తీసుకో: మగవాళ్లకి పుస్తకాలు చదివే ఆడవాళ్లు ఇష్టముండరు.” మగవాళ్లకి ఇష్టముండరేమో, కానీ కోల్కాకి ఖచ్చితంగా ఇష్టమే. ఆ రోజంతా వాళ్లు పాటలు విన్నారు, కవిత్వం చదివారు, జంతువుల గురించి మాట్లాడారు, ఆ తరువాత మళ్లీ కొన్ని పాటలు విన్నారు. “వావ్, భలే గొంతు కదా, నోనా యురీవ్నా? అబ్బా, దీపం కూడా కంపిస్తోంది!”

“అది చాలియాపిన్, కోల్కా. ఫ్యొడార్ ఇవనొవిచ్ చాలియాపిన్, ఆ విషయం గుర్తుంచుకో.”

“తప్పకుండా గుర్తుంచుకుంటాను. అతడు చాలా దృఢమైనవాడు కదా?”

“అది చెప్పటం కష్టం, కోల్కా. ఒకరి మాతృభూమిని విడిచిపెట్టి, వేరే దేశంలో చనిపోవటం – అది బలమా, బలహీనతా? నాకు బలహీనతేనని అనిపిస్తోంది.”

“అతడికి కోపం వచ్చిందేమో?”

“ఒకరి మాతృభూమిపై ఎవరికైనా కోపం ఎలా వస్తుంది? నీ మాతృభూమి ఎప్పుడూ తప్పు చెయ్యదు, కోల్కా. ప్రజలు పొరపాట్లు, తప్పులు చెయ్యవచ్చు, చెడ్డవాళ్లు కావచ్చు. కానీ, మాతృభూమి, అది చెడ్డది కాగలదా? కోపం తెచ్చుకోవటంలో ఏ మాత్రం అర్థం లేదు.”

“మనది మంచి దేశమని, ఎంతో మంచి దేశమని నాన్న చెపుతుంటాడు!”

“చాలా, చాలా మంచి దేశం, కోల్కా.”

నోనా యురీవ్నా విచారంగా నవ్వింది, కానీ ఆమె అలా ఎందుకు నవ్విందో అర్థం చేసుకునే వయస్సు కాదు కోల్కాది. ఒంటరితనం, విచారం అంటే ఏమిటో ఇంకా అతడికి తెలియదు. మానవుల సాధారణ అన్యాయపు తొలి అనుభవం, మొదటిసారి నిజంగా గాయపడటం కనీసం స్పష్టంగా ఉండి, అర్థమవుతోంది. నోనా విషాదం ఒక్కొక్కసారి ఆమెకు కూడా అర్థమయ్యేది కాదు.

ఆ మరునాడు కోల్కా తనకు తాను విధించుకున్న ఏకాంతవాసాన్ని ఇక భరించలేక అక్కడినుంచి బయలుదేరాడు. వాళ్ల నాన్న మోటారుకోసం చెరువులో పలుమార్లు మునుగుతుండగా, కోల్కా వాళ్ల అమ్మ కంటపడకుండా పెరటితోవల గుండా ఊరినుంచి బయటపడ్డాడు.

జానపద కథల్లో మాదిరి అతడి ఎదురుగా ఒకేసారి మూడు రోడ్లు కనపడ్డాయి: మొదటిది, ఊరి పిల్లలు ఈదులాడుతున్న నదివైపుకి వెళుతోంది; రెండవది, ఆనకట్టకి అవతలవైపున ఉన్న అడవిలోకి దారితీస్తోంది; మూడవది, అతడు మొన్నటిదాకా సంతోషంగా వెళ్లిన పడవలు అద్దెకు ఇచ్చే కేంద్రానికి చేరుస్తుంది. జానపద కథల్లోని కథానాయకుడి మాదిరిగానే కోల్కా కూడా ఆలోచించాడు, తటపటాయించాడు, చివరికి నిట్టూర్చి ఎడమవైపుకి తిరిగాడు: ఆ దారి అలసిన యకోవ్ ప్రొకొపిచ్ ఉన్న పడవల కేంద్రానికి వెళుతుంది.

“నమస్తే,” అన్న కోల్కా పలకరింపుకి బదులుగా “ఏం చెప్పటానికి వచ్చావు?” అని యకోవ్ ప్రొకొపిచ్ అడిగాడు. “ఇంకా ఏం చెడు వార్తలు మోసుకొచ్చావు?”

ఆందోళనకు లోనయ్యి, దానివల్ల కొంత నత్తికి కూడా లోనయ్యి కోల్కా రెండు రోజుల క్రితం జరిగిన ఘటనలు బాగా చేతులు ఊపుతూ, హడావిడిగా యకోవ్ ప్రొకొపిచ్‌కి చెప్పాడు. నీటిపై పడవ తేలికగా ఎలా తేలియాడిందో, దూరతీరాలు ఎలా చేరువయ్యాయో చెప్పాడు. పర్యాటకులకు యెగార్ ఎంత బాగా సహాయం చేసాడో చెప్పాడు. ప్లాస్టిక్ తెప్పల గురించి, నెగడు మంట గురించి,

చీమల గురించి, పసుపుపచ్చ గుడారం గురించి చెప్పాడు. కైమా ఉండల గురించి, రొట్టె గురించి, అలసి ఉన్న వాళ్ల నాన్న పర్యాటకులు బలవంతం చేసినమీదట తాగిన రెండు గ్లాసుల మద్యం గురించి చెప్పాడు. ఆ తరువాత వాళ్ల నాన్న ఎలా ఆడిందీ, ఎలా పడిపోయిందీ చెప్పాడు...

యకోవ్ ప్రొకొపిచ్ అతడి మాటలకు అడ్డుపడకుండా కోపంతో కళ్లు మిటకరిస్తూ శ్రద్ధగా విన్నాడు. చివరికి వివరణ అడిగినట్టుగా, "అయితే నువ్వు అక్కడినుంచి వెళ్లిపోయావు, అంతేనా?" అని అడిగాడు.

"అవును, వెళ్లిపోయాను," చెంపదెబ్బ గురించి చెప్పాలో వద్దో నిర్ణయించుకోలేక కోల్కా నిట్టూర్చాడు. "నేను వెళ్లిపోయాను, అతను ఉండిపోయాడు. మోటారు, అన్నీ అక్కడే ఉన్నాయి."

"అయితే నీ తప్పేమీ లేదు," ఒక్క క్షణం ఆగి అన్నాడు యకోవ్. "నువ్వు బాధ్యుడివని నేను అనటం లేదు: నువ్వు నా కింద పనిచేయటంలేదుగా."

"నా ఉద్దేశం అది కాదు," నిట్టూర్చాడు కోల్కా. "జరిగిందంతా జరిగినట్టు మీకు చెప్పాను. నాన్న చాలా ఆందోళనకు లోనయ్యాడు, యకోవ్ ప్రొకొపిచ్‌గారు."

"అతడు ఊరికే ఆందోళనకు గురయ్యాడు, నేను డబ్బు గురించి ఆందోళనకు గురవుతున్నాను. సరే... నాకు అర్థమయ్యింది. నాకు చెప్పొచ్చేంత పెద్దవాడివి కాదు నువ్వు. పిల్లోడివి. ఇక్కడనుంచి పో. మళ్లీ ఇటువైపుకి రావద్దని హెచ్చరిస్తున్నాను."

కోల్కా అక్కడినుంచి వెళ్లిపోయాడు. అతడు ఏమీ బాధపడలేదన్నది నిజమే, జరిగిన విషయాన్ని ప్రస్తావించినపుడు కోల్కా ఏమీ ఆశించలేదు. కానీ యకోవ్ ప్రొకొపిచ్‌కి జరిగినదంతా చెప్పాలనుకున్నాడు. తన తండ్రి గురించి కోల్కాకి బాగా తెలుసు, అతడు ఎవ్వరికీ జరిగింది చెప్పడు. తాను చెప్పిందంతా విని యకోవ్ ప్రొకొపిచ్ తనని పంపించివేస్తాడని ముందే ఊహించటంవల్ల అందుకు కోల్కా ఆశ్చర్యమో, ఆందోళనో పడలేదు. ఆలోచనల్లో మునిగిపోయి తిరిగి తన టీచరు దగ్గరకి వెళ్లాడు.

"మనుషులు అంత చెడ్డగా ఎందుకుంటారు, నోనా యురీవ్నా?"

"నీ అభిప్రాయం తప్పు, కోల్కా, మనుషులు మంచిగా ఉంటారు, చాలా మంచిగా."

"అయితే వాళ్లు ఇతరులను ఎందుకు గాయపరుస్తారు?"

"ఎందుకు?"

నోనా యురీవ్నా నిట్టూర్చింది: 'ప్రశ్నలు అడగటం నీకు తేలిక.' అయితే ఆమె సమాధానమేమీ ఇవ్వకుండా మిన్నకుండవచ్చు. లేదా, నవ్వు చాలా చిన్నపిల్లవాడివి, పెద్దయిన తరువాత నీకే తెలుస్తుంది అని చెప్పి తప్పించుకోవచ్చు. లేదా, వేరే విషయం గురించి మాట్లాడటం మొదలుపెట్టవచ్చు. కానీ కోల్కా కళ్లల్లోకి చూసిన నోనా అతడిని మోసగించలేకపోయింది. అవి స్వచ్ఛమైన కళ్లు, అవి స్వచ్ఛతను కోరుతున్నాయి.

"దుష్ట స్వభావం ఏమిటి, అది ఎందుకు ఉంది అని ప్రజలు చాలా కాలంగా ఆలోచిస్తున్నారు, కోల్కా. ఈ భూమి మీద మనిషి పుట్టిన నాటినుంచి ఈ విషయం గురించి వాళ్లు బుర్రలు బద్దలుకొట్టుకుంటున్నారు. చివరికి ఒకనాడు దానినంతటినీ వివరించటానికి కొమ్ములు, తోకతో ఒక దెయ్యాన్ని కనిపెట్టారు. ఇక ప్రపంచంలోని దుష్టత్వానికి అంతటికీ దానినే బాధ్యురాలిని చేశారు. కాబట్టి ప్రజలను తప్పుపట్టటానికి లేదు, తప్పంతా దెయ్యానిదే. దెయ్యం వాళ్లని పెడదారి పట్టించింది. కాని, ఆ దెయ్యం ప్రజలకేమీ సహాయపడలేదు, కోల్కా. అది దుష్టత్వానికి కారణాలు చెప్పలేదు, ప్రజలను దానినుంచి కాపాడనూ లేదు. ఎందుకనుకుంటావు?"

"ఎందుకంటే వాళ్లు కారణాలకోసం బయట వెతికారు. కాని దుష్టత్వం – అది మనిషిలో ఉంది, అది అతడి లోపల ఉంది."

"మనిషిలోపల ఇంకా ఏమి ఉంది?"

"అతడి పొట్ట! అతడి పొట్టనుంచి దుష్టత్వం వస్తుంది! ప్రతి మనిషి తన పొట్ట గురించే ఆందోళన పడుతూ చుట్టుపక్కల వాళ్లందరినీ గాయపరుస్తూ ఉంటాడు."

"పొట్టే కాకుండా మనిషి లోపల అంతరాత్మ కూడా ఉంది, కోల్కా. కానీ ఈ భావన ఇంకా పరిపక్వత చెందాలి. పరిపక్వత చెంది, బలపడాలి. ఒక్కొక్కసారి ఒక వ్యక్తి అంతరాత్మ పరిపక్వత చెందదు. చిన్నగా, కసుగాయగా, తినటానికి పనికి రాకుండా ఉంటుంది. అప్పుడు అతనికి సలహాలు ఇచ్చేవాళ్లు ఎవరూ ఉండరు, అతని లోపల తప్పొప్పులు సరిచూసేవాళ్లు ఎవరూ ఉండరు. అప్పుడు అతను మంచి ఏదో. చెడు ఏదో చెప్పలేడు: అంతా కలగలిసిపోయి, గందరగోళంగా మారుతుంది. దాంతో తనకు సరిహద్దులు నిర్ణయించుకోటానికి, సగం పరిపక్వత చెందిన అంతరాత్మతో నేరాలు చెయ్యకుండా ఉండటానికి ఇటువంటి మనుషులు నియమాలు రూపొందించుకుంటారు."

"ఎటువంటి నియమాలు?"

"ప్రవర్తనా నియమాలు: ఏది సరైనది, ఏది కాదో నిర్ణయిస్తారు. తమ చిన్న అంతరాత్మను దాని సరిహద్దులు దాటి విస్తరింపచేసి, అందరికీ అది తప్పనిసరి నియమంగా మారుస్తారు. ఉదాహరణకు, వయస్సులో ఉన్న అమ్మాయి ఒంటరిగా ఉండకూడదని వాళ్లు నమ్ముతారు. ఒకవేళ ఎవరైనా అమ్మాయి అలా ఒంటరిగా ఉంటే, ఏదో ఉందన్నమాట. అందుకే ఆమె మీద ఒక కన్నేసి ఉంచాలి, ఆమెను అనుమానించాలి, ఆమె గురించి అర్థంలేని పుకార్లను ప్రచారం చెయ్యాలి..."

నోనా యురీవ్నా మధ్యలో ఆపేసింది. సాధారణ విషయాలనుంచి ఆమె తన వ్యక్తిగత విషయాల్లోకి, నిర్ణయాల్లోకి వెళ్లిందని గుర్తించింది. ఆమె ఒక్కసారిగా భయపడిపోయింది కూడా.

"అయ్యో, పొయ్యి కట్టెయ్యటం మరిచిపోయాను!"

ఆమె బయటకు పరుగుతీసింది, కానీ కోల్కా ఆ విషయం గమనించలేదు. కనుబొమ్మలు ముడివేసి, తన ఆలోచనల్లో నిమగ్నుడయ్యాడు. నోనా యురీవ్నా మాటలు తన అనుభవాలకు అన్వయించుకోసాగాడు.

నియమాల వరకు అంతా బాగానే ఉంది. తమ నియమాల ప్రకారం జీవించే మనుషులను కోల్కా చూశాడు, ఆ నియమాలను పాటించని వాళ్లను మూర్ఖులుగానో, మోసగాళ్లగానో పరిగణిస్తారు. యకోవ్ ప్రొకొపిచ్ జీవించే నియమాలు సులువైనవి, స్థిరమైనవి అయితే తన పెదనాన్న ఫ్యొడార్ ఇపటొవిచ్ నియమాలు అందుకు పూర్తిగా విరుద్ధమైనవి. బండిగురువింద చెట్టుతో దెబ్బతిన్న యకోవ్ ప్రొకొపిచ్ సజనోవ్ నియమాలు వింతగా ఉన్నా, తిన్నగా ఉంటాయి. వాటితో పోలిస్తే, ఫ్యొడార్ ఇపటొవిచ్ నియమాలు కావాలని అలవాటు చేసుకున్నవి, ఎటంటే అటు మార్చుకోగలిగినవి. ఆ క్షణానికి అవసరమైన దేనినైనా అవి అనుమతిస్తాయి, సమర్ధిస్తాయి.

తన తండ్రి నియమాలు కూడా ఉన్నాయి. అవి చాలా సులువైనవి: ఇతరులు మీద ఎప్పుడూ ఎటువంటి నియమాలూ రుద్దవద్దు. అతడు అలా రుద్దలేదు కూడా. అతడు ఎప్పుడూ నిశ్శబ్దంగా, మంద్రస్థాయిలో జీవించేవాడు: ఎవరికీ ఇబ్బంది కలిగించటంలేదు కదా అని, సూర్యకాంతికి అడ్డుపడటం లేదు కదా అని, ఎవరి దారికీ ఆటంకంగా లేను కాదా అని ఎప్పుడూ చుట్టూ పరికించి చూసేవాడు. ఇందుకు అతడికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలపాలి, కానీ ఒక్కరంటే ఒక్కరు కూడా అతడికి కృతజ్ఞత తెలిపేవాళ్లు కాదు.

కోల్కా కనుబొమ్మలు ముడివేసి తాను ఏ నియమాల ప్రకారం జీవించాలో ఆలోచించసాగాడు. తన తండ్రి మాదిరి ప్రజలందరూ తమ అంతరాత్మల ప్రకారం జీవించి, అసలు నియమాలు లేకుండా చెయ్యటం ఎలాగో ఆలోచించసాగాడు.

మంచి, చెడుల గురించి కోల్కా ఆలోచిస్తూ ఉండగా, పాఠశాల ఉపాధ్యాయిని నోనా యురీవ్నా నిశ్శబ్దంగా రోదిస్తోంది. ఆమె ఇంటి యజమానురాలు లేదు కాబట్టి ఇప్పుడు ముఖానికి నవ్వు పులుముకుని తిరగాల్సిన అవసరం లేదు; తన దురదృష్టం గురించి, కళ్లద్దాల గురించి, అలవరుచుకున్న ఇబ్బందికరమైన ప్రవర్తన గురించి, సుదీర్ఘ ఒంటరితనం గురించి తనివి తీరా ఏడ్వవచ్చు.

మగవాళ్లు నిజంగానే పుస్తకాలు చదివే ఆడవాళ్లను ఇష్టపడరేమో?

*(తరువాయి భాగం వచ్చేవారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige .com